ప్రజాశక్తి
బుధవారం 21 ఫిబ్రవరి 2024
5
శ్రీకాకుళం

నేడు స్కిల్ క్వెస్ట్

శ్రీకాకుళం : నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈనెల 21న స్కిల్ క్వెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు, సృజనాత్మకత, వ్యవస్థాపక దృక్పథం పెంచడం ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. వ్యాపారం, స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవడానికి స్కిల్ క్వెస్ట్ దోహదపడుతుందని తెలిపారు. ఆహారం-పానీయాలు, కళలు-చేతి పనులు, మరమ్మతులు, సరదా ఆటలు, డయాగ్నస్టిక్‌లకు చెందిన సుమారు 50 స్టాల్స్ విద్యార్థులతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే గుణపాఠం

- ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల హెచ్చరిక
- శ్రీకాకుళం నగరంలో బైక్ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా

ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, ఎపి జెఎసి జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం హెచ్చరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ నగరంలోని ఎన్‌జిఒ హోం నుంచి కలెక్టరేట్ వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. చర్చల్లో ఇచ్చిన హామీలను సైతం సకాలంలో నెరవేర్చకుండా దాటవేత వైఖరి అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. 30 శాతం ఐఆర్, 11, 12 పిఆర్‌సి బకాయిలు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గురుకులాలు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఈనెల 27న చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డిఎ బకాయిలను ఐదేళ్లలో చెల్లించలేదని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల జీతభత్యాల కోసం ప్రకటించే పిఆర్‌సిలో తీవ్రమైన అన్యాయం చేశారన్నారు. దేశ చరిత్రలోనే పిఆర్‌సి ద్వారా ఉద్యోగుల జీతాలు తగ్గించిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కిందని విమర్శించారు. రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రూ.25 వేల కోట్ల పైబడి బకాయిలు ఉన్నా, కుటుంబ అవసరాల కోసం ఉద్యోగులు రుణం కోసం దరఖాస్తు చేస్తే సమయానికి చెల్లింపులు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, జిల్లా నాయకులు టి.చలపతిరావు, డిటిఎఫ్ నాయకులు పేడాడ కృష్ణారావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర, బి.శ్రీరామ్మూర్తి, పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు పార్వతీశం, బి.ధనుంజయరావు, పలు సంఘాల నాయకులు చల్లా శ్రీనివాసరావు, కె.భానుమూర్తి, మదన్‌మోహన్, బి.పూర్ణచంద్రరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

శ్వేతగిరి కొండ పైకి వెళ్తున్న యాత్రికులు

శ్వేతగిరి జనసంద్రం

శాలిహుండం యాత్రకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - గార

భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని శాలిహుండంలో శ్వేతగిరిపై కాళీయ మర్దన వేణుగోపాల స్వామి యాత్ర మంగళవారం కన్నులపండువగా సాగింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆలయ ట్రస్టీ సుగ్గు మధురెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని సమర్పించగా, గోపాలకృష్ణారెడ్డి దంపతులు ప్రసాదాలు, పల్లి నర్సింహులు కుటుంబసభ్యులు పంచామృతాలను సమర్పించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశాలో పలు ప్రాంతాల నుంచి యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం ఉదయం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను కొండపై నుంచి ఊరేగింపుగా వంశధార నదీ తీరానికి తరలించి అక్కడ చక్రతీర్ధ స్నానాలను నిర్వహించారు. అనంతరం యాత్రికులు వంశధార నదిలో స్నానాలు చేసి మెట్ల మార్గం గుండా శ్వేతగిరిపైకి చేరుకుని వేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు. క్యూలైన్లు యాత్రికులతో కిటకిటలాడాయి. కొండపై ఉన్న పంచక్షేత్రాలు కూడా యాత్ర సందర్భంగా రద్దీగా మారాయి. యాత్రకు వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. యాత్రికుల సౌకర్యార్థం ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడిపింది. యాత్రికుల కోసం శాలిహుండం, పూసర్లపాడు, బోరవానిపేట, బూరవల్లి పరిసర గ్రామాల్లో పులిహోర, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

కార్మికులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

ధర్నా భగ్నానికి యత్నం

- వ్యవసాయ కాంట్రాక్టు కార్మికులను అడ్డుకున్న పోలీసులు
- రైల్వేస్టేషన్ నుంచి పోలీస్‌స్టేషన్‌కి తరలింపు
- నోటీసులు ఇచ్చి విడుదల

ప్రజాశక్తి - ఆమదాలవలస

సమస్యల పరిష్కారం కోరుతూ కృషి విజ్ఞాన కేంద్రం, ఎఆర్ఎస్, ఆర్ఎఆర్ఎస్‌ల్లో పనిచేస్తున్న వ్యవసాయ కాంట్రాక్టు కార్మికులు గుంటూరు జిల్లాలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వద్ద ఈనెల 21న తలపెట్టిన ధర్నాను భగ్నం చేసేందుకు ప్రభుత్వం పోలీసులను ప్రయోగించింది. ధర్నాలో పాల్గొనేందుకు ఆమదాలవలస రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతున్న 24 మంది కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. ధర్నాకు అనుమతుల్లేని కారణంగా వెళ్లడానికి వీల్లేదని ఎస్ఐ కె.వెంకటేష్ వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 149 కింద నోటీసులు అందజేసి, ధర్నాలో పాల్గొనబోమని సంతకాలు తీసుకుని వారిని విడిచిపెట్టారు. కెవికె కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సీతామహాలక్ష్మి, పి.త్రివేణి మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం తమపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని విమర్శించారు. రోజువారీ వేతనంతో జీవనం సాగిస్తున్న తమకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో అంబటి యుగంధర్, ఎ.గణపతి, బి.తేజేశ్వరరావు తదితరులున్నారు.

సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్షాల నాయకులు

సంక్షేమ చట్టం అమలు చేసే వారికే మద్దతు

- స్పష్టం చేసిన భవన నిర్మాణ కార్మిక సంఘం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం నిలుపుదల చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించి, అమలు చేసే వారికే వచ్చే ఎన్నికల్లో మద్దతు తెలుపుతామని భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రకటించింది. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన అఖిలపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.హరినారాయణ, ఎం.హరనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని రద్దు చేసే ఆలోచన చేసిందని చెప్పారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం తీవ్ర నిరసనల ఫలితంగా వెనక్కి తగ్గిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మెమో 1214 ద్వారా ఈ చట్టాన్ని నిలిపివేసిందన్నారు. దీంతో జిల్లాలో సుమారు ఎనిమిది వేల క్లయిమ్‌లు పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. ప్రభుత్వ ఖజానాపై పైసా కూడా భారం పడకుండా, నిర్మాణ యజమానుల నుంచి నిర్మాణ విలువలో ఒక శాతం సెస్ రూపంలో రూ.వేల కోట్లు వసూలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఆ నిధులను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయడం లేదని విమర్శించారు. చట్టం అమలును నిలిపివేసి, వస్తున్న సెస్‌ను ఇతర అవసరాలకు మళ్లించడం సరికాదన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. ఇప్పటికే పలు కారణాలతో నిర్మాణ కార్మికులకు చేతి నిండా పని లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. 1214 మెమోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. దీన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫేస్టోలో పొందుపరచాలని, ఆమేరకు స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. తమ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి మేనిఫేస్టోలో పొందుపరిచేలా కృషి చేస్తామని పలు పార్టీల నాయకులు హామీనిచ్చారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, జనసేన జిల్లా అధ్యక్షులు పి.చంద్రమోహన్, కాంగ్రెస్ నాయకులు డి.గోవింద మల్లిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.సింహాచలం, సిపిఐ నాయకులు చిక్కాల గోవిందరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి చక్రధర్, ఎ.కామేశ్వరరావు, పైడి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా పట్టుబడిన వెండి

- 135 కేజీల ఆభరణాలు స్వాధీనం!
- రైల్వే పోలీసుల అదుపులో తమిళనాడువాసులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో భారీగా వెండి ఆభరణాలను రైల్వే పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 135 కేజీలు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన ఆర్.నిత్యానందం, ప్రకాష్ రామస్వామి, సతీష్ కుమార్ బాలసుబ్రమణ్యంను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరు నుంచి భువనేశ్వర్‌కు ఎటువంటి రికార్డులు లేకుండా వెండి ఆభరణాలను తరలిస్తున్నారు.

రైల్వే పోలీసుల తనిఖీల్లో భారీగా తరలిస్తున్న వెండి ఆభరణాలను గుర్తించారు. వాటికి సంబంధించిన పత్రాల్లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలను జిఎస్‌టి అధికారులకు రైల్వే పోలీసులు అప్పగించారు. దీనిపై ఆర్‌పిఎఫ్ అధికారులను విలేకరులు ప్రశ్నించగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

టెక్నికల్ ఫెస్ట్‌లో ట్రిపుల్ ఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

రాజాంలోని జిఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నిర్వహించిన వెబ్-ఓ-స్తవ్ టెక్నికల్ ఫెస్టివల్‌లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి ద్వితీయ సంవత్సర ఇంజినీరింగ్ విద్యార్థులు బహుమతులు సాధించారు. అడ్వాన్స్‌డ్ విభాగంలో 'ఎలక్టివ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' టైటిల్‌లో సాయిసంతోష్, ప్రేమ్‌చంద్, తరుణ్, కిరణ్ విజేతలుగా నిలిచి రూ.పది వేలు నగదు బహుమతిని పొందారు. బేసిక్ విభాగంలో 'హాస్టల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ఆవిష్కరణలోనూ ట్రిపుల్ ఐటి విద్యార్థులు ద్వితీయ బహుమతిని సాధించారని డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.డి.జి బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆచరణాత్మక జ్ఞానం అవసరమన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డి సుధాకర్‌బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ, స్టూడెంట్ డీన్ అఫైర్స్ జి.రవి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, కంప్యూటర్ సైన్స్ హెడ్ వై.రమేష్, వెబ్ మాస్టర్ దిలీప్ కుమార్ కోడా తదితరులు విద్యార్థులను అభినందించారు.

340 మందికి 'కళ్యాణమస్తు'



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాల కింద జిల్లాలో 340 మందికి రూ.2.13 కోట్లు విడుదల విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఈ పథక లబ్ధిదారులకు బటన్ నొక్కి నిధులను మంగళవారం విడుదల చేశారు. కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు నమూనా చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి, మైనార్టీలకు చెందిన 340 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరిందని చెప్పారు. పేద కుటుంబాలు తమ ఆడపిల్లలకు గౌరవప్రదంగా వివాహం చేసేందుకు ఈ పథకం అండగా నిలుస్తుందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతులు, 21 ఏళ్లు నిండిన పురుషులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. బాల్య వివాహాలను నిరోధించడానికి ఈ నిబంధనలు దోహదపడతాయన్నారు. చదువు ప్రాధాన్యత కూడా పెరుగుతుందని చెప్పారు. తల్లిదండ్రులకు పిల్లల వివాహం భారం కాకుండా ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడీ విద్యాసాగర్, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు వై.విశ్వమోహన్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం : మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో మోటారు ప్రమాద కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ చేసేందుకు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఇన్సూరెన్స్ కంపెనీలు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్, మోటారు ప్రమాద కేసుల్లో పిటిషనర్ల తరుపు న్యాయవాదులకు సూచించారు. జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మోటారు వాహన ప్రమాద బాధితులకు జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందన్నారు. కేసుల రాజీ ద్వారా బాధితులకు తక్షణ ఆర్థికసాయం అందుతుందని చెప్పారు. బ్యాంకు, చిట్‌ఫండ్ కంపెనీల్లో రుణం తీసుకున్న వారిపై మానవతా దృక్పథంతో ఎంతో కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించాలన్నారు. సమావేశంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జ్ఞాన సువర్ణరాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియాను కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రతినెలా మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలన్నారు. ప్రతినెలా క్లాప్ వెహికల్ యాజమాన్యం, యూనియన్‌తో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ సెలవు దినాలను అమలు చేయడంతో పాటు డ్రైవర్లందరికీ యూనిఫామ్, గుర్తింపుకార్డులు ఇవ్వాలని, క్యాజువల్ లీవ్‌లు అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో క్లాప్ వెహికల్ డ్రైవర్లు రామకృష్ణ, తేజ, కిరణ్ తదితరులున్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తం

పాతపట్నం : ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎఎస్‌పి జి.ప్రేమకాజల్ అన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ, సిబ్బందిపై ఆరా తీశారు. ఎన్నికల దృష్ట్యా 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణా కాకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం

శ్రీకాకుళం అర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో లబ్ధిదారులకు అందజేసిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని బాకర్‌సాహెబ్‌పేట వార్డు సచివాలయాన్ని మంగళవారం సందర్శించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. సచివాలయం పరిధిలో మంజూరు చేసిన పట్టాల్లో సాంకేతికపరమైన ఇబ్బందులు ఉన్న వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని శతశాతం పూర్తి చేయాలన్నారు.

PUBLIC NOTICE

Public are hereby informed that my client Kotni Venkata Jyothi, W/o Ganesh got the Schedule property through Registered Sale Deed No. 1452/2018, dt.25-06-2018 from 1.Kelam Vara Prasada rao, S/o late Narasinga Rao and his son 2. Kelam Chakradhar, my client approached to Fincare Small Finance Bank Ltd. Narsannapeta Branch for Housing loan and given as security of Registered Sale Deed No. 1452/2018, dt.25-06-2018. In this the executants got the property through Pattadar Passbook No. 264, dt. 28-12-2000 issued by Mandal Revenue Officer, Hiramandalam of Survey No. 298-3, for loan purpose my client submit Xerox copy of pattadar pass book in that it shows as exhibit by the Junior Civil Judge, Pathapatnam,

Under the enquiry from Kelam Vara Prasada rao he states that the plaintiffs are Kelam Vara Prasada Rao and his brothers filed against the defendant Anuguru Vijaya Lakshmi for permanent injunction on 19-10-2001 vide OS No. 98/2001, the both parties jointly NOT PRESSED the suit, for this purpose the Honourable Court Dismissed the case as not pressed for this reason in the pattadar pass book has marked as exhibit. Hence if anybody has any objection come forward within 7 days from this date.

schedule:

The Vacant site is covered in Sy No. 298/3 is situated at Srikakulam District, Hiramandalam Sub-Division, Hiramandalam Mandalam, Hiramandalam Panchayathi, Hiramandalam Village,9th ward, way of china korada, Eastern side of A.B Road, nearest Dr. No. 9-4,Korada Revenue Village of vacant site measuring
East-West - 60 feet or 18.30 mtrs
North-South- 16 feet or 4.957 mtrs
to an extent of 108.33 Sq. vacant site is having following Boundaries
East - Timber Depo of Shankumthala Maharana;
South- Slab of Shankumthala Maharana;
West- AB Road;
North- Vacant Site of Shankumthala Maharana

M. CHANDANA
ADVOCATE, SRIKAKULAM.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.A 8/2019 in I.P. 14/2015

Between: **M/s Wind Investment Consultancy Pvt. Ltd. (Wind Broking)** --Petitioner/petitioner.
And: **M Srinivasarao,** --Respondents
To,
R-2: Geetha Bharathi, W/o Punnarao, aged about 37 years, Hindu, Household duties and usines resident of Door No.1-28-22, Adarsa Nagar, Pedda Waltair, Visakhapatnam.
R-3: Veerala Chakravarthy Babu, S/o V.Ch.B.Vijayam, aged about 45 years, Hindu, Business, resident of Door No 44-28-14, Railway New Colony, near Hara Gopal School, Visakhapatnam-530016.
R-4: Gunta Manjula, wife of Tatarao, aged about 34 years, Hindu, Household duties and business resident of Door No.4-44, Pedda Koviripeta village, Umilada post, Santhabommali mandal, Srikakulam District.
R-5: Guntumukkala Ryindra Varma, son of M.N.Pallavi, aged about 31 years, Hindu, Business, resident of Door No.7-5-147, Bay Breeze Residency, Maithreya Nagar, near Aqua Sports Complex, Pandurangapuram, Visakhapatnam-530003.
R-9: Dasari Rohan Kumar, son of Laxmanarao, aged about 29 years, Hindu, Business, resident of Door No.2-31, Pedda Koviripeta village, Umilada post, Santhabommali mandal, Srikakulam District.
R-10: Komara Sandhya, D/o Narayanarao, aged about 37 years, Hindu, Household duties and Pusiness, resident of Door No.20-89-3, Golla veedhi, Visakhapatnam.
R-12: Tekumalla Padmaja, wife of T.V.Ramanamurthy, aged about 46 years, Hindu, Household duties and Business, resident of Door No.5-5-158, Beach Road, Ocean View Extreme Layout, near Swimming Pool, Visakhapatnam.

Take notice that the insolvency petition filed by the above named petitioner is posted for hearing at **10.30 AM., on 26-02-2024** before the Honourable Senior Civil Judge Court, Srikakulam, and if you wasn't to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and expert.

L. LAXMI
ADVOCATE, SRIKAKULAM.

అవగాహన కల్పిస్తున్న బ్రహ్మానందరెడ్డి

సర్వీస్ కమిషన్ పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట

సర్వీస్ కమీషన్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు సిలబస్ అంశాలను చదివేటప్పుడు విశ్లేషణాత్మక దృక్పథాన్ని అనుసరించాలని బ్రహ్మాస్ అకాడమీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో సర్వీస్ కమిషన్ పరీక్షల సన్నద్ధతపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహనతో పాటు విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలని సూచించారు. ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు.. ఇలా అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలన్నారు. దీంతో పాటు జాతీయ స్థాయిలో తాజా రాజ్యాంగ సవరణలు, నూతన జాతీయ విద్యావిధానం, ఇటీవల కాలంలో కీలకమైన తీర్పుల గురించి పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్. దుర్గాప్రసాద్, ఎకాడమిక్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నివేదిక అందజేయాలి

ఆమదాలవలస: పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించారని పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటాగా తీసుకొని తక్షణ నివేదిక అందించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యులు గొండు సీతారాం జిల్లా విద్యాశాఖ, పోలీసు శాఖలకు ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈ నివేదికలో వెల్లడించిన అంశాలు ఆధారంగా ఉపాధ్యాయుడు, స్కూల్ యాజమాన్యం పైన క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పాఠశాల గుర్తింపును రద్దు చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సులు చేయనున్నట్లు సీతారాం తెలిపారు. వెంటనే నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి నివేదిక అందించాలన్నారు.

ప్రారంభిస్తున్న చైర్మన్ గిరిబాబు

తాగునీటి ట్యాంకు ప్రారంభం

పలాస: వేసవి సమీపిస్తున్న తరుణంలో మున్సిపాలిటీలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ సూదికొండ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకును మంగళవారం ప్రారంభించారు. అనంతరం పలాస మంకినమ్మ ఆలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు రూ.17 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు, కాలువ పనులకు కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.వంద కోట్ల వ్యయంతో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేందుకు పనులు ముమ్మరంగా చేపడుతున్నామని అన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. పార్టీలకతీతంగా వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో శిష్టి గోపి, బల్లయ్య పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి- పొందూరు

వైసిపి ప్రభుత్వం హయాంలో వాలంటీర్లు అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రాపాక కూడలి జెవిఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారులకు నేరుగా అందజేసిన ప్రభుత్వమిదని తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్లకు సన్మానించి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకటకృష్ణారావు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, ఎంపిడిఒ సూర్యనారాయణ, తహశీల్దార్ పాల్‌కిరణ్ పాల్గొన్నారు.

పలాస : మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

పలాస : వాలంటీర్ల సేవలకు ఎవరైనా సలామ్ చేయాల్సిందేనని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస నియోజకవర్గ పరిధి వాలంటీర్లకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో పురస్కారాల ప్రదానం చేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వాంటీర్లకు సేవారత్న, సేవావజ్ర, సేవామిత్ర పుర స్కారాలను అందించి శాలువాతో సత్కరించి మెడల్, ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సనపల సింహాచలం, హనుమంతు వెంకట్రావు దొర, మందస ఎంపిపి, జెడ్‌పిటిసిలు డొక్కరి దానయ్య, సవర చంద్రావతి, పలాస, వజ్రపుకొత్తూరు ఎంపిపిలు ఉంగ సాయికృష్ణ, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, జెడ్‌పి వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిని శ్రీనివాస్, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల చిట్టిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర బుజ్జి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక కమలా కళ్యాణ మండపంలో వాలంటీర్లను ఎమ్మెల్యే రెడ్డి శాంతి సన్మానించారు.

పొందూరు : వాలంటీర్లను సన్మానిస్తున్న స్పీకర్ సీతారాం

మండలంలో సేవా వజ్ర, శేవారత్న, శేవామిత్ర 299 మంది వాలంటీర్లను ఎంపిక చేశారు. వీరికి మెడల్, ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందించారు. దుంపల పుష్పకు సవా వజ్ర, ఐదుగురికి సేవ రత్న, 293 మంది సేవా మిత్రలను ప్రదానం చేశారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఎస్.వాసుదేవరావు, తహశీల్దార్ జానకమ్మ, ఎంపిడిఒ కొండలరావు, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, సుభాష్, శ్రీనివాసరావు, శశిభూషనరావు పాల్గొన్నారు.

నందిగాం : ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్లకు ఎంపిపి నడిపూరి శ్రీరామ్మూర్తి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి చక్రవర్తి, మండల పార్టీ అధ్యక్షులు టి.ఫాల్గుణ, జెసిఎస్ కన్వీనర్ జె.జయరాం, సర్పంచ్‌లు బొమ్మాళి గున్నయ్య, పోలాకి మోమన్, కణితి నారాయణమూర్తి, ఎర్రన్నరాజు, మాజీ జెడ్‌పిటిసి కె.ధర్మారావు పాల్గొన్నారు.

మస్టర్లలో సంతకాలు లేకుండా

డబ్బులు ఎలా చెల్లిస్తారు..?

డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో సంతకాలు లేకుండా డబ్బులు చెల్లింపై డ్వామా పీడీ చిట్టిరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖల్లో చేపట్టిన పనులుపై మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 29 పంచాయతీల్లో కూలి వ్యయాలు కింద చెల్లించిన సుమారు రూ.8.8కోట్లు, అలాగే 27 సచివాలయాల పరిధిలో చేపట్టిన ప్రాధాన్యత భవన నిర్మాణాలు సంబంధించి రూ.4.08 కోట్లు పనులపై తనికీలను నిర్వహించారు. మండలంలోని బురిడికంచరాంలో ఓరిజనల్ మస్టర్లు లేకుండా చేపట్టిన పనులకు సంబంధించి విచారణకు ఆదేశించారు. తనికీల్లో మస్టర్లు సంతకాలు లేకపోవడంతో పాటు తప్పులు దొర్లడం వంటి పలు అంశాలకు సంబంధించి పలు గ్రామాలకు సంబందించిన టిఎలు, ఎఫ్‌లు నుంచి సుమారు రూ.58 వేలు రికవరీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. పొందూరు, వి.ఆర్.గూడెం, కింతలి గ్రామాల్లో కొలతల పుస్తకాల్లో నమోదు సక్రమంగా లేవని పేర్కొన్నారు. అలాగే పొందూరు, వి.ఆర్.గూడెం, లోలుగు గ్రామాల్లో జనవరిలో చేసిన పనుల్లో తక్కువ పనిచేసి ఎక్కువ పేమెంట్లు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ, ఎపిడి కె.లోకేశ్వరరావు, ఎపి అంబుడ్స్‌మెన్ సన్యాసిరాజు, క్వాలిటీ కంట్రోల్ అధికారి వి.సతీష్‌బాబు, డ్వామా సామాజిక తనికీ విభాగం మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఎస్‌టిఎం గౌరీశంకర్, ఎస్ఆర్‌పీ చంద్రమోహన్, ఎపిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

అడవి పందుల బెడద

ధ్వంసమైన కొబ్బరి పల్లెరం

కవిటి: మండలంలో అడవి పందుల బెడద రైతులను హడలెత్తిస్తోంది. తోటల్లో కొబ్బరి మొక్కలతో పాటు వేసిన పంటలు ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు కొండముచ్చులు మరోవైపు అడవి పందులు మండలంలోని రైతులపై పగపట్టాయని వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రైతులు ఒక్కరే ఉన్న సందర్భాల్లో ఇవి దాడి చేస్తున్నట్టు వీరు తెలిపారు. ఇటీవల కాలంలో జల్లుపుట్టుగ తదితర ప్రాంతాల్లో కొండముచ్చులు దాడిలో గాయపడి పలువురు ఆస్పత్రి పాలయ్యారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా వీటి నుంచి రైతాంగానికి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

రేపు జాబ్‌మేళా

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జెకెసి, కృష్ణపట్నం సెక్యూరిటీ సర్వీస్ విజయనగరం ఆధ్వర్యాన 90 ఉద్యోగాలకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, కెరీర్ గైడెన్స్ చదువుకునే నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు.

రామ్‌మల్లిక్‌నాయుడు ఆర్థికసాయం

లావేరు : మండలంలోని గుమ్మాడంలో ఇటీవల నూతనంగా నిర్మించిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తనవంతు సహాయంగా రూ.25 వేలు మంగళవారం అందజేశారు. ఈ ఆర్థికసాయాన్ని విగ్రహ కమిటీ సభ్యుడు సుత్తి సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉప్పాడ పావుడు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

వైసిపిలోకి 60 కుటుంబాలు చేరిక

రణస్థలం : స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలంలోని మెంటాడ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల నుంచి సర్పంచ్ ప్రతినిధి ఆర్.ఎస్.రెడ్డి అధ్యక్షతన 60 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలోకి మంగళవారం చేశారు. వీరికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ వైసిపి జెండాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వగ్రి నరసయ్య, వగ్రి అప్పన్న, వగ్రి రాంబాబు, ముక్కు సంతోష్, బంగార్రాజు,రాము తదితరులు ఉన్నారు. మహంతి పెద్దరాము నాయుడు, మైలపల్లి కామరాజు, జి.మానస తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కొత్తూరు

మృతి చెందిన రాజు

మండలంలోని కుంటిభద్ర లో జగదీశ్వరి షా మిల్లు గెస్ట్‌హౌస్‌లో సోమవారం రాత్రి భోగి రాజు (51) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోంపేట మండలం పల్లిపాలవలసకు చెందిన రాజు షా మిల్లులో కట్టర్ మేస్త్రీగా ఈ నెల 1న విధుల్లోకి చేరారు. కొద్దిరోజులుగా ఆయాసంతో బాధపడుతూ ఇబ్బందులకు గురవుతున్నాడు. ఇక్కడే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులానే గెస్ట్‌హౌస్‌లో నిద్రించాడు. మంగళవారం ఉదయం ఎప్పటికీ బయటకు రాకపోవడంతో తోటి కార్మికులు తలుపు తట్టారు. స్పందన లేకపోవడంతో తలుపు బద్దలు కొట్టి చూడగా దూలంకు తువ్వాలు మెడకు వేసుకుని ఆత్మహత్య చేసుకుని వేలాడుతూ కనిపించారు. వెంటనే షా మిల్లు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయాసంతో ఇబ్బంది పడడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య హేమావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ నారాయణస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


భానుచంద్రరావు మృతదేహం

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

టెక్కలి రూరల్ : టెక్కలి మండలం నౌపడ ఆర్ఎస్ రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం విశాఖకు చెందిన చెంచుల భానుచంద్రరావు (35) రైలు ఎక్కుతూ కిందపడిపోయి మృతి చెందారు. మూడు రోజుల క్రితం యామలపేట వచ్చి తిరిగి విశాఖపట్నం వెళ్లేందుకు రైలు ఎక్కుతుండగా జారిపడ్డాడని రైల్వే పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా... అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కార్యదర్శి...

టెక్కలి : మండలంలోని బూరగాం పంచాయతీ కార్యదర్శి గేదెల గణపతి (47) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. నందిగామ మండలం నవరకరజాడలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. కొద్ది సంవత్సరాలుగా మండలంలోని పలు పంచాయతీల్లో కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ హనుమంతు వెంకటరమణమూర్తి, ఉద్యోగులు రామకృష్ణ, అభిషేక్, కార్యదర్శుల సంఘం నాయకులు సోమేశ్వరరావు, పాల రవికుమార్, ఉమామహేశ్వరరావు, బాబూరావు, చంద్రరావు, రామ్‌కుమార్, వర్ధన్‌లు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఫాస్టర్ శామ్యూల్...

శామ్యూల్ (ఫైల్)

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో డగ్లస్ స్కూల్ సమీపాన నివాస ముంటున్న ఫాస్టర్ డాక్టర్ జి.శామ్యూల్ (88) మంగళవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా ఆయన అస్వస్థతతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయనకు భార్య విజయరత్నం, కుమారుడు డేనియల్ గోడి, కుమార్తెలు వివేవ్ గ్లోరీ, గ్రేస్ విక్టోరియా ఉన్నారు. ఆయన పెద్ద కుమారుడు జాన్ ఎన్ గోడి కొంత కాలం క్రితం మృతి చెందారు. 1960లో క్రైస్తవ మత ప్రచారకునిగా వచ్చిన ఆయన ఇక్కడే స్థిరపడ్డారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి

ఇచ్ఛాపురం : మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి న్యాయవాదులు సహకారం అందించాలని జూనియర్ సివిల్ జడ్జి పి.సురేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్ కేసులు ఉన్నాయని అన్నారు. కక్షిదారులతో చర్చించి ఎక్కువ కేసులు రాజీ చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దేవరాజ్, సీతయ్య, నాగరాజు పాత్రో, భగవాన్‌దాస్, లక్ష్మీనారాయణ, ఎన్.సి.సాహు, మనోజ్, జగ్గారావు, సోమశేఖర్, ఎ.నారాయణ, మురళి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న జడ్జి సురేష్‌కుమార్

కోటబొమ్మాళి: సమాజంలో కుల, మత, లింగ, వర్ణ వివక్షత లేకుండా సమాన న్యాయమును అందించడమే న్యాయస్థానాల, న్యాయ సేవా సంస్థల ముఖ్య ఉద్దేశమని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. సామాజిక న్యాయదినోత్సవం సందర్భంగా కోర్టు అవరణలో న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్‌అదాలత్, ప్రజా న్యాయ పీఠం ద్వారా అన్ని రకాల సివిల్ కేసులను, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను, మనోవర్తి కేసులను, రాజీ మార్గం చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సదస్సులో న్యాయవాద సంఘ అధ్యక్షులు దుంపల నరసింహమూర్తి, న్యాయవాద సంఘ కార్యదర్శి వెలమల అప్పలనాయుడు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు

విశాఖ స్కూల్ చైర్మన్ మధుసూదన్

మెటీరియల్స్‌ను అందజేస్తున్న మధుసూదన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి తోడ్పడుతుందని సాయి ప్రియదర్శిణి ఎడ్యుకేషనల్ సొసైటీ, విశాఖ స్కూల్ చైర్మన్ డాక్టర్ కె.మధుసూధన్ అభిప్రాయపడ్డారు. నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో విశాఖ స్కూల్‌లక్ష పదో తరతగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో సమయపాలన, కష్టపడి చదవాలన్న ఆకాంక్ష ఉండాలన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.రామారావు మాట్లాడుతూ స్కూల్‌లో నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదివి క్రమ శిక్షణ గల విద్యార్థులుగా పేరు తెచ్చుకున్నారన్నారు. అలాగే మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పలు సినీగేయాలకు నృత్యాలు చేశారు. అనంతరం పరీక్ష సామగ్రిని అందజేశారు.

కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షులుగా శైలజ

టెక్కలి : కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షులుగా కొత్తూరు శైలజని నియమించినట్లు డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ నియామకాల్లో భాగంగా ఎస్‌సి విభాగానికి సంబంధించి వారికి ప్రాధాన్యత కల్పించాలని శైలజానే నియమించినట్లు పేర్కొన్నారు. శైలజ నియామకంతో మహిళా కాంగ్రెస్ విభాగంలో ప్రతి ఒక్కరినీ గర్తించినట్లు చెప్పారు. శైలజ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

నువ్వలరేవు జెట్టీని పూర్తి చేయాలి

వజ్రపుకొత్తూరు: మండలంలోని నువ్వలరేవు, మంచినీళ్లపేట మధ్య జెట్టీ నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనని జనసేన నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు ప్రభుత్వానికి ప్రశ్నించారు. జెట్టీ నిర్మాణ ప్రదేశాన్ని జన సైనికులతో వెళ్లి మంగళవారం సందర్శించారు. మత్స్యకార గ్రామాల నుంచి వలసలు అధికంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం జగన్ ఐదేళ్ల కిందట రూ. 12 కోట్లతో శంకుస్థాపన చేసిన ఇప్పటికీ పనులు కొలిక్కి రాకపోవడం అన్నారు. మత్స్యకారులపై వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఎన్నికల ముందు మత్స్యకారుల ఓట్లు కోసం ప్రభుత్వం చేస్తుందన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు ఎంతో అవసరమైన నువ్వలరేవు జెట్టీని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ముప్పల పూర్ణచంద్రరావు, బైనపల్లి భాస్కరరావు, ముప్పల రుషి, ఎం.ధర్మారావు, బి.కళ్యాణ్, బెహరా పద్మనాభం, దినేష్‌కుమార్ ఉన్నారు.

ఆందోళన చేస్తున్న జనసేన నాయకులు

జర్నలిస్టుపై దాడి తగదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జర్నలిస్టుపై దాడి తగవని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పేడాడ పూర్ణారావు అన్నారు. సత్యసాయి జిల్లా రాప్తాడులో సిఎం జగన్ సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసిపి నాయకులు మూకలు కర్రలు చేతులతో విచ్చలవిడిగా దాడి చేయడంపై తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దాడికి నిరసనగా స్థానిక వన్ వే కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జర్నలిస్టుపై దాడి సిగ్గో సిగ్గో, హేయమైన చర్య, అంటూ నినాదాలు చేశారు. ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దుప్పల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా పనిచేస్తున్న పత్రికా జర్నలిస్టుపై దాడులు చేయడం తగదని అన్నారు. అక్కడ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమశీల్దార్ కె.వేణుగోపాల్‌ను కలసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తమ్మినేని అన్నం నాయుడు, ఎ.శంకర్, అన్నెపు రమేష్, వి.జగ్గునాయుడు, సనపల చంద్రశేఖర్, అన్నెపు మోహనరావు, పాత్రుని రామ్మోహనరావు, దుర్గారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : సత్యసాయి జిల్లా రాప్తాడు సిఎం జగన్ సభలో వైసిపి నాయకులు జర్నలిస్టుపై దాడికి తెగబడడం హేయమైన చర్యని, నిందితులను తక్షణమే అదుపులోకి తీసుకుని అరెస్టు చేయాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండుశంకర్ డిమాండ్ చేశారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో దళితులపై, గిరిజనులపై, బిసిలపై దాడులు పెరిగాయని విమర్శించారు. ఈయనతో పాటు బైరి మాజీ సర్పంచ్ ఎండు చిన్నారావు, బి.నాగేంద్ర యాదవ్, రాయి కిరణ్, పొన్నాడ కిషోర్, పొన్నాడ ప్రసాద్, మైలపిల్లి నర్సింహమూర్తి, రవి ఉన్నారు.

ఆమదాలవలస : వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఇచ్ఛాపురం : ఆంధ్రజ్యోతి జర్నలిస్టు కృష్ణపై దాడిపై టిడిపి నాయకులు ఒక ప్రకటనలో ఖండించారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు కాళ్ల జైదేవ్ యాదవ్, తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ పార్లమెంట్ అధ్యక్షుడు వూన సంతోష్‌కుమార్, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జిలానీ, 17వ వార్డు ఇన్‌ఛార్జి జన్నెల సంతోష్‌కుమార్, పట్టణ ఐటిడిపి అధ్యక్షుడు సాలిన జగదీష్ యాదవ్, పైల నారాయణరావు ఉన్నారు.

మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

టిడిపి, జనసేనతోనే అభివృద్ధి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని హరిశ్చందప్రురం పంచాయతీ ఉప్పరపేట, బాపన్నపేట, చిన్నహరిశ్చంద్రపురం గ్రామాల్లో మాజీ సర్పంచ్ పూజారి శైలజ ఆధ్వర్యాన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం టిడిపి, జనసేన కూటమి ఏర్పడిందన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధికి 20 ఏళ్లు వెనుకపడిందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, జనసేన టెక్కలి నియోజకవర్గ నాయకులు కణితి కిరణ్‌కుమార్, పల్లి కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు పాల్గొన్నారు.

పలువురి చేరిక

కోటబొమ్మాళి పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు తాలాసు కృష్ణ, తాలాసు రాజేష్, పొట్నూరు నరసింహమూర్తి, రమణమూర్తి, సకలాభక్తుల భీమారావు, వెంకటరావు, సంతోష్, సునీల్, హరి, కిరణ్, పొట్నూరు మందిప్, నందాన గోవింద్, అంధవరపు కృష్ణారావు, బోయిన ఈశ్వరరావులు టిడిపిలోకి చేశారు. అలాగే టెక్కలి మండలం బన్నువాడ పంచాయతీ నుంచి వార్డు మెంబర్ కొల్లి ధర్మారావు, నంబాళ నారాయణ, రమణ, కొల్లి దుర్యోధనరావుతో పాటు 20 కుటుంబాలు, ఆదిఆంధ్రావీధి నుంచి గొల్లవలస ఢిల్లేశ్వరరావు, చింతల భాషాలతో పాటు 50 కుటుంబాలు చేరాయి. వీరికి అచ్చెన్న పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన సమైక్యంగా కృషి చేసి పూర్వ వైభవానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక ఓ కళ్యాణ మండపంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జిలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఉమ్మడి టిడిపి, జనసేన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ, ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, కదంబల పైడిరాజు, అగ్గాల శ్రీనివాసరావు, మాలతి శ్రీధర్, వసంత్, సిలార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

సంతబొమ్మాళి : మండలంలోని పిన్నింటిపేట సబ్ స్టేషన్ పరిధిలో బోరుభద్ర పరిసర ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని టెక్కలి ఇఇ శంకరరావు, సంతబొమ్మాళి మండల విద్యుత్‌శాఖ ఎఇ ఎం.శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మెంటినెన్స్ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటలకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని తిరుపతిపాలెం నుంచి 30 కుటుంబాలు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు, టిడిపి యువనాయకులు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామమల్లిక్ నాయుడు సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలోకి మంగళవారం చేశారు. వారికి టిడిపి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మీసాల రమణ, ఆకుల అసిరినాయుడు, ఆకుల చిన్న, ఆకుల అసిరి నాయుడు, కంది రమణ, ఆకుల సీతంనాయుడు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో నివాస ముంటున్న కళింగ కోమటి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోరాడ రమేష్ ఆధ్వర్యాన వ్యాపారులు అరసవల్లిలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీ దేవి సమక్షంలో టిడిపిలో చేరారు. చేరిన వారిలో నగరానికి చెందిన విశ్రాంత ఎల్ఐసి ఉద్యోగి కిల్లంశెట్టి రమేష్, టౌన్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధి జామి రాధాకృష్ణ, హోల్‌సేల్ మెడికల్ షాపుల యజమానుల సంఘం ట్రెజరర్ జామి మణి, టౌన్ మెడికల్ రిటైల్ అసోసియేషన్ ప్రతినిధి బరాటం ఈశ్వరరావు ఉన్నారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరిగోపాల్, నగర పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, అంధవరపు రఘు, జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ జామి భీమ శంకరావు, నగర బిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కర్రి మోహనరావు పాల్గొన్నారు.

గొండు శంకర్ ఆధ్వర్యాన...

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గొండు శంకర్

నగరంలోని హయాతీనగరంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ సమక్షంలో పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. టిడిపిలో చేరిన వారిలో యలమంచిలి హరికృష్ణ, యలమంచిలి పవన్‌కుమార్, కోర్ణన రాము, అలబాన చిన్నారావు, ఆలబన జయా, దువ్వ రమణ, రాము తదితరులు ఉన్నారు. వారికి టిడిపి కండు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బొల్ల నాగేంద్ర యాదవ్, రెడ్డి శంకర్, ఎండు చిన్నారావు, సానివాడ సర్పంచ్ రమణమూర్తి, పాత్రునివలస సర్పంచ్ పంచిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

తప్పుడు ప్రచార పోస్టులపై ఫిర్యాదు

వజ్రపుకొత్తూరు: సామాజిక మాధ్యమాల్లో టిడిపి తప్పుడు పోస్టులు పెడుతున్న వ్యక్తులపై సైబర్ నేరాల చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శశిభూషణ్ కోరారు. ఈ మేరకు వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులపై హెడ్ కానిస్టేబుల్ రమణను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి నాయకులను అప్రతిష్టపాలు చేయడానికి వైసిపి నాయకులు వారి సోషల్ మీడియాతో దుష్ప్రచారం చేయడానికి పూనుకున్నారని ఆరోపించారు. నువ్వలరేవు, మంచినీళ్లపేట గ్రామాలను కలుపుతూ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ టెండర్ అంగీకారం కోసం అప్పటి టిడిపి ప్రభుత్వం 2016లో జిఒ సంఖ్య 366 జారీచేసిందన్నారు. దీనిని తారుమారు చేస్తూ వాట్స్ అప్, ఫేస్ బుక్‌ల్లో పోస్టులు పెడుతూ టిడిపి గౌరవానికి భంగం కలిగిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుతో పాటు సోషల్ మీడియా క్లిప్పింగ్‌లను అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సురాడ మోహనరావు, ఉపాధ్యక్షులు అరసవిల్లి ఉమామహేశ్వరరావు, కోనారి కిరణ్‌కుమార్, ఆకుల భాస్కరరావు, అంబటి రామకృష్ణ, బాలకృష్ణ, శాంతారావు, మరడ దుర్యోధన పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

టెక్కలి రూరల్ : ఓటును వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ సక్రమంగా సద్వినియోగం చేసుకుని మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని సినీ నిర్మాత డాక్టర్ బలగ ప్రకాష్ అన్నారు. ఆదిత్య కళ్యాణ మండపంలో సమాలోచన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ ఓటుతోనే దేశ చరిత్ర మారుతుందన్నారు. మన ఉనికి ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో మనల్ని మనమే కాపాడుకొని ఆత్మగౌరాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వజ్యోతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దుప్పల రవికుమార్, రామాంజనేయులు, చింతాడ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రకాష్

పశువులను పరీక్షిస్తున్న డాక్టర్ సుబ్రమణ్యం

కొండవలసలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని కొండవలసలో కృషి విజ్ఞాన కేంద్రం దత్తత గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.సుబ్రహ్మణ్యం 60 ఆవులకు, 20 లేగ దూడలకు, 50 గొర్రెలకు చికిత్స చేసి ఖనిజ లవణ మిశ్రమాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా అనేక రకాల వ్యాధులను నివారించవచ్చునని అన్నారు. పశువుల బీమా పథకం, లేగ దూడ సంరక్షణ చర్యలు, పాదం, నోటి వ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా కలిగే ప్రయోజనాలను వెల్లడించారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పశుగ్రాసాల వాడకంపై అవగాహన కలిగి ఉండడంతో పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్లు డి.సతీష్‌కుమార్, ఎస్.కిరణ్‌కుమార్, పశు వైద్య సిబ్బంది జి.శిల్ప, ఇ.సంతోషి, సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు, అభ్యుదయ రైతు ఎల్.నీలంనాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలు

పొందూరు : సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే విజయానికి సోపాలని నాగావంశ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ అన్నారు. స్థానిక వైసిపి నాయకులు హంస సూరిబాబు నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు భారీ ఎత్తున అందించే ఏకైక సిఎం జగన్ అన్ని అన్నారు. పేదల పక్షాన నిలిచి ప్రగతి ఫలాలు అందిస్తున్నారని అన్నారు. ముందుగా మాజీ సర్పంచ్ గంగిరెడ్ల ఉమాదేవి భర్త సత్యనారాయణను పరామర్శించారు. అనంతరం కనకల వీధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సేకరించిన స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో నాగవంశ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు నల్లి ఆశాదీపిక, గంగిరెడ్ల ఉమాదేవి, హంస సూరిబాబు, నక్క సత్యనారాయణ ఉపాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ పద్మజ

కార్డుల పంపిణీలో జాప్యం తగదు

కోటబొమ్మాళి: మండలంలోని 26 సచివాలయాలు పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్‌భవ కార్డులు పంపిణీలో జాప్యం తగదని ఎంపిడిఒ ఎచ్చెర్ల పద్మజ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో, క్షేత్ర సహాయకులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. నిమ్మాడ, లఖందిడ్డి, జర్జంగి సచివాలయాల పరిధిలో ఈకార్డులు పంపిణీలో వెనకబాటుగా ఉందని, వెంటనే ఈ కార్డులను పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అలాగే గృహనిర్మాణ శాఖలో ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు 90 రోజులు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ అరుణ్ కుమార్, జెఎజి హరిప్రసాద్ పాల్గొన్నారు.

టెక్నీషియన్లకు శిక్షణా తరగతులు

పలాస : పలాస సామాజిక ఆస్పత్రి ఆవరణంలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు మంగళవారం శిక్షనా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ఇఎంటిలకు యునైటెడ్ కింగ్డమ్ మాడ్యుల్ అనుగుణంగా శిక్షణ అందించారు. ఎఇఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఇఒ జగన్నాథ రావు పర్యవేక్షణలో ఆన్ జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ తరగతులను నిర్వహించారు. అత్యవసర ప్రసూతి వైద్య సేవలు, గర్భిణికి ప్రథమ చికిత్స, మందుల పంపిణీపై వివరించారు.

ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు రక్ష అని పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చీమలవలసలో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. అనంతరం ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, తొగరాం పిహెచ్‌సి వైద్యులు మెట్ట స్రవంతి, సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని ఎంపిడిఒ సతీష్ ఆధ్వర్యాన సిలగాం సింగివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగుపురం పిహెచ్‌సి వైద్యులు లిల్లీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి

ఆమదాలవలస : కిట్లును పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కంచు వసంతరావు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : మండలంలోని సిందువాడ సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి బమ్మిడి జ్యోతిర్మయి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందు కామేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని అరకభద్ర పంచాయతీలో ఎంపీ నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ మంగళవారం ప్రారంభించారు. ముందుగా టిడిపి నాయకులు ఘనస్వాగతం పలికారు. రూ.5 లక్షలతో గ్రామంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమం లో టిడిపి నాయకులు దక్కత ఢిల్లీరావు, దక్కత శ్రీను, పెద్దిన బాబ్జీ, సహదేవ్‌రెడ్డి, పద్మనాభం, కామేశ్వరరావు, మేరుగు సూర్యనారాయణ, ప్రకాశనాయక్, గిన్ని బాలరాజు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పంచాయతీ ఎస్‌సి వీధిలో రహదారి నిర్మాణానికి స్థానిక ఎంపిపి నిర్మల దాసు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వీధిలోని 15 కుటుంబాలు వైసిపి పార్టీలో చేరాయి. వారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతని శాసగిరి, ఎంపిటిసి డి.మాధవరావు, దుర్యోధన, లింగరాజు, తాతారావు, నాని శివరామకృష్ణ, శంకరరావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూర్యనారాయణ

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో క్షేత్రస్థాయిలో ప్రజా పంపిణీ సమయంలో ఎండియు ఆపరేటర్లకు ఎదురవుతున్న సమస్యలు పరిష్క రించాలని ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, డిఎస్ఒ ఇన్‌ఛార్జి శాంతిశ్రీను మంగళవారం కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఎండియు ఆపరేటర్ల సంఘం జిల్లా ప్రతిని ధులు నరేష్, షేర్‌ఖాన్, అప్పారావు, వరుణ్, జగన్, శ్రీను, రాజా, బాలకృష్ణ, శంకర్, దివాకర్, కిరణ్ పాల్గొన్నారు.

ఆర్‌బికెలు మంజూరు చేయాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో రైతుల అవసరాల మేరకు రత్తకన్న, బెల్లుపడ, పురుషోత్తపురంలో రైతు భరోసా కేంద్రాలు మంజూరు చేయాలని సీడాఫ్ ఛైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని చీఫ్ కమిషనర్ ఆర్‌బికె స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాబును కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంత రైతాంగానికి రైతు భరోసా కేంద్రాలు చాలా అవసరమని అన్నారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించి తదుపరి కార్యాచరణ చేపడతామని అన్నారని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

సముదాయాలను వినియోగించుకోవాలి

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనలో మరిన్ని మెళకువలు నేర్చుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యని అందించేందుకు సముదాయాన్ని వినియోగించుకోవాలని ఎంఇఒ తులసీరావురెడ్డి సూచించారు. మంగళవారం నిర్వహించిన పాఠశాల సముదాయాలు ముగింపు సమావేశంలో పాల్గొన్నారు. ఒకచోట నిర్వహించే ఈ సముదాయాల వల్ల ఉపాధ్యాయుల్లో మరింత మెళకువలు మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సముదాయాల్లో చర్చించుకున్న అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సముదాయాల్లో టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పై పెరుగుతున్న నమ్మకం

మాజీ మంత్రి కళావెంకటరావు

ప్రజాశక్తి- రణస్థలం

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భవిష్యత్‌కు సూచిస్తూ... బాబు గ్యారెంటీతో మేనిఫెస్టోలో అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల్లో రోజురోజుకీ నమ్మకం పెరుగుతుందని మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలంలోని పైడిభీమవరంలో శంఖారావం సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనిఫోస్టోతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. మహాశక్తి పేరుతో మహిళలకు చేయూత అందించనున్నారని అన్నారు. నిరుద్యోగ యువతకు ఏటా ఉపాధి కల్పనా లక్ష్యంగా ఏ విధంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.

లావేరు: టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. లావేరులోని మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలతో ముద్రించి పోస్టలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణం, ఏడాదిలో మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందజేస్తారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీను, ఇజ్జు రాజేశ్వరరావు, కొమ్మూరి శ్రీను, గండి సురేష్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న కళావెంకటరావు

నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులుగా సూరిబాబు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

వైసిపి ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రత్యేక పరిశీలకులుగా అంధవరపు సూరిబాబుని సిఎం జగన్ నియమించారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సహాయ సహకారాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో రణస్థలం, జి.సిగడాం మండలాల జెసిఎస్ ఇన్‌ఛార్జిలు చిల్ల వెంకటరెడ్డి, డోల వెంకటరమణ, కార్యాలయ ఇన్‌ఛార్జి మురళీధర్ బాబా, మహిళా విభాగం జిల్లా జనరల్ సెక్రటరీ గురాన మానస పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పలాస : అనారోగ్యంతో మృతి చెందిన తోటి మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001 పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు స్నేహ బంధాన్ని చాటుకున్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమతో పాటు పదో తరగతి చదువుకున్న సూరి నాగరాజు కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పరిస్థితిల రీత్యా విజయనగరం జిల్లా చీపురుపల్లికి వలస వెళ్లిపోయారు. నాగరాజు అనారోగ్య కారణంగా కొద్ది రోజులు కిందట మృతి చెందారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు చీపురుపల్లిలో నివాసం ఉంటున్న నాగరాజు కుటుంబ సభ్యులకు రూ.1.50 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సూరి సంతోష్ కుమార్, జామి శ్రీనివాస్, జోగి ఉమ, పొట్నూరు జయరాం పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

టెక్కలి : ఈ నెల 23 నుంచి 25 వరకు నంద్యాలలో జరుగు 52వ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నందుకు జిల్లా జట్టు ఎంపిక మంగళవారం నిర్వహిం చామని ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడన నారాయణరావు తెలిపారు. 12 మంది గ్రూపు సభ్యులుగా ఉన్న రెండు జట్లను ఎంపిక చేశామన్నారు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చేపట్టే ఈ ఎంపిక పోటీలకు వ్యాయామ ఉపా ధ్యాయులు కె.కె.రామిరెడ్డి, కుప్పిలి ప్రకాష్, గదిలపు శ్రీనివాస్, అజయ్, సీతయ్య, సత్య సహకరించారని తెలిపారు.

క్రీడా సామగ్రిని అందజేస్తున్న మల్లేశ్వరరావు

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- పలాస

నందిగామ మండలం పెంటవురుకు జె.ఢిల్లీరావు, పుణ్యవతి దంపతులు ఖాతర్‌లో ఉంటున్నారు. వారి కుమార్తె ప్రజ్ఞ జ్ఞాపకార్థం వారి ఆర్థికసాయంతో ప్రజ్ఞ హెల్పింగ్ హాండ్స్ సంస్థ ద్వారా కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హాకీ టీమ్‌కి రూ.ఆరు వేలు విలువైన క్రీడా సామగ్రిని వైద్యులు ఎం.మల్లేశ్వరరావు చేతుల మీదుగా క్రీడాకారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా రంగంలో పాల్గొని మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. హాకీ లాంటి జాతీయ క్రీడల్లో ఉన్నతస్థాయిలో చేరుకోవాలని పిలుపునిచ్చారు. నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ మాట్లాడుతూ మాట్లాడుతూ హాకీ టీమ్‌కి భవిష్యత్‌లో ఏ రకమైన సహాయం కావాలన్నా ముందుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో హాకీ కోచ్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనసేన బాసట

కవిటి: మండలంలోని కొమ్ముపుట్టుగకు జనసేన బాసటగా నిలిచింది. ఇచ్చిన మాట ప్రకారం జనసేన నాయకుడు దాసరి రాజు మంగళవారం గ్రామంలో తాత్కాలిక రహదారి నిర్మాణం చేపట్టారు. ట్రాక్టర్లతో కంకర తెప్పించి రహదారి చదును చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన, టిడిపి అధికారంలో వచ్చిన వెంటనే గ్రామానికి పక్కా రహదారి నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జన సైనికులు మధు, శ్యామ్, ధనుంజయం, వైకుంఠరావు, భాస్కర్, రఘు, నాగరాజు, మహేష్, సాయి, హేమంత్ పాల్గొన్నారు.

కంకర వేయిస్తున్న రాజు